క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

పూతలపట్టు: పూతలపట్టు మండలం సంజీవ రాయనిపల్లిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

సర్వర్ డౌన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం నెట్ సక్రమంగా రాకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వినియోగదారులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 నుంచి 12 వరకు నెట్ దాదాపుగా లేదు. అనంతరం సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ సెంట్రల్ వెబ్‌సైట్ పనిచేయలేదు. ఈసీ, సీసీలు నెమ్మదిగా వచ్చిన కేవైసీ కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. సాధారణ రోజుల్లో 35 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి, మంగళవారం 14 డ్యాకుమెంటేషన్లు మాత్రమే జరిగాయి. వరుసగా మూడు రోజులు ప్రభుత్వ కార్యాలయాలు సెలవులు కావడంతో సర్వర్ సమస్య వచ్చిందని కార్యాలయ సిబ్బంది చెప్పారు.

వారపుసంత వేలం రేపు

బంగారుపాళెం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వారపు సంత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో దిన, వారపుసంతకు సంబంధించి ఏడాది పాటు గేటు వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలం వేయనున్నట్లు వివరించారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

చెరువులో చేపల మృత్యువాత



చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం నల్లవెంకటయ్యగారిపల్లి చెరువులోని చేపలు మృత్యువాతపడుతున్నాయి. రెండు వారాలుగా 60 నుంచి 80 కేజీల వరకు చేపలు మృతిచెందాయని గ్రామస్తులు చెబుతున్నారు. మృత్యువాత పడ్డ చేపలన్నీ చెరువు గట్టుకు కొట్టుకొస్తున్నాయి. దీంతో చెరువు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రస్తుతం ఈ చెరువులో రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షలు విలువ చేసే చేపలు ఉండవచ్చునని, అధికారులు స్పందించకుంటే ఉన్న చేపలు కూడా మృతిచెందే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు విశేష స్పందన



గోవిందరెడ్డిపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ఇరువారంపల్లెలో ఉదయం, గోవిందరెడ్డిపల్లెలో మధ్యాహ్నం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు 104 వైద్య శిబిరంలో 105 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. అనంతరం దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేసుకున్న రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సలహాలు ఇచ్చారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జ్వరాలు సోకితే వైద్యులను సంప్రదించాలి



విద్యార్థులకు చేతులు శుభ్రం చేయడంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

తవణంపల్లె: ప్రజలకు జ్వరాలు సోకితే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. మంగళవారం కె.పట్నం, జొన్నగురకల గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కె.పట్నంలో వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పరుగెడితేనే ప్రమాదం

- జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చు
- వాటి వైపు చూడకుండా మెల్లగా నడవాలి
- వీధి కుక్కల నియంత్రణకు అధికారుల చర్యలు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

గుడిపాల: పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధి కుక్కల సంఖ్య పెరిగిపోయింది. దీంతో రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో చిన్నారిపై కుక్కలు దాడి చేసి ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు కుక్కలు కనిపిస్తేనే భయాందోళన చెందుతున్నారు. అయితే వీధికుక్కలు కనపడితే పిల్లలకు, పెద్దలు భయపడవద్దని, పరుగెడితే వెంటపడి కరుస్తాయని పశుసంవర్థకశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు:

ఇటీవల కాలంలో జిల్లాలో కుక్కలు గొర్రెల మందలపై దాడులు చేయడం, విద్యార్థులు, చిన్నారులను కరవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులోభాగంగా సంతానోత్పత్తి కలగకుండా వాటికి కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలు చేశారు. చిత్తూరు నగర పాలక సంస్థలో 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 2 వేల వీధి కుక్కలకు శస్త్ర చికిత్స చేయడం గమనార్హం. శస్త్రచికిత్స అయిన కుక్కలు దీర్ఘాయుష్షుతో బతకడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటాయి. చెవిని కత్తిరించి ఉంటే ఆపరేషన్ అయ్యిందని గుర్తు. ఆడకుక్కల వెంట మగ కుక్కలు తిరగకుండా చాలా వరకు తగ్గిపోతాయి. ఆపరేషన్ అయినవి చాలా వరకు కరవడం తక్కువ. ఎందుకంటే వాటిలో ఆగ్రహం తగ్గిపోతుంది. కుక్కల నివారణకు శస్త్ర చికిత్సలు, రేబీస్ టీకాలు వేయించడం సురక్షితమైన శాశ్వత పరిష్కారం.

జాగ్రత్తలు ఇలా:

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తరాదు. కుక్కల కళ్లల్లోకి తదేకంగా చూడరాదు. వాటి పిల్లల దగ్గరకు వెళ్లరాదు. తల్లి కుక్క కాటువేసే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటునప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించడం గానీ, ఏ రకంగా నైనా ఇబ్బంది పెట్టొద్దు.
- ఒకవేళ కుక్కదాడి చేస్తే ముఖాన్ని చేతులతో లేదా ఏదైనా కప్పుకోండి. ఎందుకంటే ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా మీ దగ్గరికి వస్తే నేలపైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి. –ఎలాంటి భయం లేకుండా తన దారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు.
- ఒకవేళ కుక్క కరిస్తే అక్కడ కొళాయి లేదా చెంబుతో నీటి ధారపోస్తూ సబ్బుతో పదినిమిషాలు కడగాలి. లైఫ్‌బాయ్ సబ్బయితే మంచిది. డెటాల్, బెటాడిన్, గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చికుక్క అయితే వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టించర్, అయోడిన్ వేయకూడదు. గాయానికి కట్టువేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

భయపడే కొద్దీ చెలరేగిపోతాయి:



తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుక్కకాటు నుంచి తప్పించుకోవచ్చు. కొంతమంది కుక్కలను చూసి కరుస్తాయనే భయంతో పరుగెడతారు. అది పద్ధతి కాదు. మనం భయపడే కొద్దీ కుక్కలు చెలరేగిపోతాయి. ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కార్పొరేషన్‌లతో పాటు పంచాయతీల్లో కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నారు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి. – డాక్టర్ సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్



ఈ=ఎంసీ2 ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

బంగారుపాళెం: ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అని టీకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వేణురెడ్డి అన్నారు. శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతిని మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఐన్‌స్టీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఐన్‌స్టీన్‌ను ఆదర్శగా తీసుకుని గొప్పశాస్త్రవేత్తలుగా రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఐన్‌స్టీన్ ప్రతిపాధించిన ఈ=ఎంసీ2 ఆకారంలో కూర్చుని ఆయనకు నివాళులర్పించారు. పై ఆకారంలో విద్యార్థులు ప్రదర్శించారు. కృష్ణబిలాలపై పరిశోధనలు చేసిన స్టీఫెన్ హాకింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రవిచంద్రారెడ్డి, వెంకటస్వామి, సుబ్బలక్ష్మి, సరోజమ్మ, దేవకి, జయప్రకాష్, దేవేంద్ర పాల్గొన్నారు.



ఐన్‌స్టీన్, హాకింగ్ చిత్ర పటాల వద్ద నివాళి

మెరుగైన వైద్య సేవలందించాలి



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ మైథిలి

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర టీబీ ఆరోగ్య సంస్థ ప్రతినిధి (డబ్ల్యూహెచ్ఓ) డాక్టర్ మైథిలి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె టీబీ రోగుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు రీడ్స్ సంస్థ సాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటేనే టీబీ నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్టు



పలమనేరు: పలమనేరు సమీపంలోని చెన్నై– బెంగళూరు హైవేలో పత్తికొండ– గంగ్రాజుపల్లె మధ్య చిత్తూరు డీటీఎఫ్(డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్) బృందం మంగళవారం కర్ణాటక నుంచి మోటార్ సైకిల్‌లో మద్యం తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వీరినుంచి 21 బాటిళ్ల విస్కీ,12 బాటిళ్ల బీరు బాటిళ్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో గంగవరం మండలం పత్తికొండకు చెందిన రామప్ప(48), పలమనేరుకు చెందిన సుభాన్‌బాష(32)గా గుర్తించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు సీఐ మాధవస్వామి తెలిపారు. ఈదాడిలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్ర సెమినార్‌కు ఆదర్శరైతు

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెకు చెందిన ఆదర్శరైతు జగదీష్‌రెడ్డిని మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించనునన్న సెమినార్‌కు గాడ్జేబాబా అమరావతి యూనివర్సిటీ ఆహ్వానించినట్లు మంగళవారం తెలిపారు. ఈనెల 15న అమరావతి గాడ్జే వర్సిటీలో నిర్వహించనున్న గ్లోబల్ సైన్స్ సెమినార్‌లో సేంద్రియ వ్యవసాయం సాగుపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ఆదర్శరైతుగా తనను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించండి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి

గుడిపాల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రతి పాడి పశువుకు వేయించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి అన్నారు. మంగళవారం గాలికుంటు నివారణ టీకాలను వేస్తున్న గ్రామాలను ఆమె తనిఖీ చేశారు. ఇందులోభాగంగా ఆమె మండలంలోని బొమ్మసముద్రంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పశువుల్లో పిడుదులు నివారించినపుడు పశువులు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఇకపై పశువులకు సంబంధించి టీకాలు, మందులను ఆర్బీకేల ద్వారా ఉచితంగా పొందే అవకాశం ఉందన్నారు. గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి అధికంగా సోకే అవకాశం ఉందని పశువులకు వ్యాధి వచ్చినట్లయితే వెంటనే పశువైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం రికార్డులన్నింటినీ ఆమె పరిశీలించారు. డాక్టర్ రవితేజ, సిబ్బంది కిషోర్, పావని, రైతులు పాల్గొన్నారు.



మాదిరెడ్డిపల్లెలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

యాదమరి: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని యాదమరి మండల పశువైద్యాధికారి అమరనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం మాధిరెడ్డి పల్లె సచివాలయ పరిధిలో ఉన్న పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ టీకాలు వేసుకున్న పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందని చెపుతారని, అలా ఏమీ లేదని తెలిపారు.

వినియోగ బిల్లు...సౌరశక్తితో చెల్లు

- సోలార్‌పై ఆదరణ పెరగాలి
- ఎక్కువ యూనిట్లు వాడేవారికి ఉపయోగం
- మూడేళ్ల తర్వాత ఆదాయమే



చిత్తూరులో ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

చిత్తూరు కార్పొరేషన్: వేసవి తాపం పెరుగుతోంది ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకం పెరగడమే కాకుండ వినియోగదారులకు బిల్లుల భారం కూడా తప్పదు. విద్యుత్‌ను ఆదా చేస్తే ఆ మేరకు ఉత్పత్తి చేసిన దానితో సమానమని విద్యుత్ ఆదా పాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నాయి. తక్కువ విద్యుత్ వినియోగించేలా ఇప్పటికే గృహ వినియోగంతో పాటు వీధి దీపాలకు ఎల్ఈడీ బల్బులు వినియోగించేలా చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయం ఇంధన వనరుల్లో భాగంగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. కొన్ని రకాల ఉత్పత్తులపై రాయితీలు ఇస్తున్నారు. సౌర విద్యుత్‌లో పనిచేసే వ్యవసాయపంపు సెట్లపై రాయితీ కల్పించారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. కొంతమంది గృహస్థులు సైతం సౌర విద్యుత్ వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. డివిజన్ పరిధిలో అన్ని రకాల సౌర సర్వీసులు కలిపి మొత్తం 100 వరకు ఉన్నాయి.

ఉపయోగాలు

ఒకేసారి పెట్టుబడి పెడితే కేంద్ర ప్రభుత్వం 20 శాతం రాయితీ ఇస్తుంది. దీనిని గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా వినియోగదారుడికి ఆదాయం లభిస్తుంది. గృహ వినియోగదారుడికి నెలకు విద్యుత్ బిల్లు రూ.3వేలు వస్తే 3 కేవీ సౌర శక్తి అనుసంధానం చేసిన వినియోగదారుడు సరఫరా చేసిన దాని మేరకు నెలకు రూ.500 మాత్రమే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా నెలకు రూ.2500 మిగులుతుంది. కనీసం మూడేళ్లలో పెట్టుబడి తిరిగి వచ్చేస్తోంది. తర్వాతా అంతా ఆదాయమే.

దరఖాస్తు ఇలా

గృహ వినియోగదారుడు 3 కేవీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే ఒక కిలోవాట్‌కు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. 3 కేవీలకు కలిపి రూ.1.50 లక్ష అయితే 20 శాతం రాయితీపోయి రూ.1.20 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వినియోగదారుడు సంబంధిత వెండర్స్‌ను సంప్రదించాలి. తిరుపతిలో వెండర్స్ ఉన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి అనుమతి తీసుకుని ఇంటికొచ్చి ఎక్కడ ఏర్పాటు చేయాల్లో నిర్ణయిస్తారు. ఏర్పాటైనప్పటి నుంచి యూనిట్లు లెక్కలోకి తీసుకుంటారు. నెట్ మీటరు సింగిల్ ఫేజ్ రూ.1972, 3 ఫేజ్ మీటర్ రూ.3,694 అవుతుంది. దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ అధికారులు స్థలాన్ని పరిశీలించి వెంటనే అనుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా ఎక్కువ బిల్లు వచ్చేవారికి సోలార్ విధానం ఎంతో ఉపయోగకరం. గ్రూప్‌గా సర్వీసుదారులు ఏర్పడి వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.

సోలార్‌తో ఎంతో ఉపయోగం



సోలార్ విధానంతో గృహ వినియోగదారులకు 20 శాతం రాయితీ ఉంది. వాణిజ్యపరంగా రాయితీలు ఉండవు. కొంతమంది వినియోగదారులు వారు వినియోగించే యూనిట్ల కంటే సోలార్ ఉత్పత్తి ఎక్కువగా వస్తోంది. అటువంటి బిల్లు కట్టాల్సిన అవసరం ఉండదు. శాఖా పరంగా వారికి యూనిట్లు సర్దుబాటు చేస్తాం. – పద్మనాభపిళ్లై, ఇంచార్జి ఈఈ ట్రాన్స్‌కో

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



గుడిపాల: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు

గుడిపాల: నులిపురుగుల మాత్రలు ప్రతి ఒక్కరూ వేసుకోవాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి కుమార్, ఎంఈఓ రామ్‌నాయక్ అన్నారు. మంగళవారం నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2–19 సంవత్సరాల విద్యార్థులు అందరూ మాత్రలను వేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సబర్మతి. ఏఎన్ఎం జబసెల్వి, ఆశావర్కర్ సుజిమ పాల్గొన్నారు.

నులిపురుగులను నివారించండి

ఐరాల: పిల్లల్లో నులిపురుగులను నివారించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని ఐరాల, ఇరువారంపల్లె ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పూర్ణలత, ఐరాల హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ఓ సుగుణ, పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం..

పూతలపట్టు: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించి నులిపురుగులను నులిమేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. పూతలపట్టులోని జెడ్పీ ఉన్నత పాఠశాలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలకు నులి నివారణ మాత్రలు పంపిణీ చేసి ఆరోగ్య సూచనలు, సలహాలు అందించారు. అయ్యప్పగారిపల్లి సచివాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. తరువాత స్థానిక ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి పిల్లలు, ఉపాధ్యాయుల హాజరుపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

డీ వార్మింగ్ మాత్రలతో పిల్లలకు ఆరోగ్యం..

యాదమరి: ప్రతి విద్యార్థి డీ వార్మింగ్ మాత్రలు వేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ చిట్టిబాబు సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల కార్యక్రమంలో భాగంగా యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ముందు యాదమరి వైద్యాధికారి సురేఖ డీ వార్మింగ్ మాత్రలను విద్యార్థులచే మింగించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ విద్యార్థులకు మాత్రలను మింగించారు. వైద్యాధికారి మాట్లాడుతూ మాట్లాడుడు 19 ఏళ్ల వరకు పిల్లలు డీ వార్మింగ్ మాత్రలు వేసుకోవచ్చన్నారు. యాదమరి ఉన్నత పాఠశాల హెచ్ఎం గిరిరాజ, ఆస్పత్రి సీహెచ్ఓ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్: నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, డీఎంఅండ్‌హెచ్ఓ ప్రకాశం అన్నారు. మంగళవారం నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణ మందు వేసుకునేలా టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు.

9,043 మంది పిల్లలకు ఆల్బెండజోల్

తవణంపల్లె: మండలంలోని 9,043 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు తవణంపల్లె వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ ప్రియాంక తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్నం పాఠశాలలలోని విద్యార్థులకు డాక్టర్ ధాత్రేయచౌదరి ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక జొన్నగురకల పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో 9,450 మంది విద్యార్థులు ఉండగా 9,043 మంది విద్యార్థులకు మాత్రలు మింగించినట్లు వివరించారు. పీహెచ్ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, జయమ్మ, అమరావతి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థికి మాత్ర వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



మాట్లాడుతున్న తహసీల్దార్, వైద్యాధికారి



జొన్నగురకలలో విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న డాక్టర్ ప్రియాంక


పౌష్టికాహార కిట్ల పంపిణీ



టీబీ కిట్లు పంపిణీ చేస్తున్న డీఐఓ రవిరాజు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు టీబీ పేషెంట్లకు పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో పాటు మంచి ఆహారం అందిస్తే టీబీ పేషెంట్లు కోలుకుంటారన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి అందులోకి దాతల ప్రమేయాన్ని తీసుకువచ్చారన్నారు. మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గాయపడిన మరో యువకుడు మృతి



మృతిచెందిన కార్తికేయన్

పలమనేరు: మండలంలోని పలమనేరు– గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై టి.వడ్డూరు చెరువు కట్ట మలుపులో సోమవారం సాయంత్రం పల్సర్‌బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పురుషోత్తమన్(26) సోమవారం రాత్రి స్థానిక ఏరియా ఆస్పత్రిలో మృతిచెందాడు. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన కార్తికేయన్ కుమారుడు రాహుల్(21), గుడియాత్తం తాలుకా సైనిగుంటకు చెందిన రజకన్ కుమారుడు సాయి పురుషోత్తమన్(26) బైక్‌పై టెంగ్రోజుల కిందట పలమనేరుకు వస్తుండగా ఎదురుగా వెళుతున్న లారీ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రాహుల్ తల చిధ్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌లో వెనుక కూర్చుని ఉన్న పురుషోత్తమన్ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో ఉంటూ కాసేపటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.